తెలుగు తల్లి వాత్సల్యం

# జోలపాటలు

దేవులపల్లి కృష్ణశాస్త్రి

ఈ లోకంలో మొట్ట మొదటి తల్లివి, ఎవరమ్మా నువ్వు? అమ్మా నీ మొట్ట మొదటి పాట ఎప్పుడు పాడేవు? ఎక్కడ పాడేవు? పారుటాకుల పాన్పుపై పవ్వళించిన పసిగందును చూసి, నువ్వేమను కున్నావమ్మా మొదట? ఎక్కడనుంచి వచ్చిందీ ఈ బిడ్డ అనుకున్నావా? ఎవరికోసం వచ్చిందీ ఈ పాప అనుకున్నావా? నా కోసమేనా, నా కోసమే అని ఆశ్చర్య పడుతున్నావా? కళ్లెందుకు తెరవదు పాప, ఆ పెదవుల మీద ఆ నవ్వు ఎక్కణ్ణుంచి వచ్చింది పాపకు? నీ వెవరవో తెలుసునేమోనమ్మా పాపకు. అందుకే నవ్వుతుంది అంతా తెలిసున్నట్లు! అంతలో క్యారు క్యారు మంటుందే? పాపం, నీగుండె ఎట్లా కరిగిపోయి ఉంటుందో మొదట? నీలో ఎందుకమ్మా పాల సముద్రం అలా పొంగిపోతుంది? అయ్యో మళ్లీ క్యారు క్యారు మంటుందే. తల్లీ పాడు, కన్నతల్లీ పాడవమ్మా.

"ఆయి ఆయి ఆయి ఆపదలు కాయి."

అని పాడేవా? ఆ పాట ఎలా గొచ్చింది నీకు. మొట్ట మొదట ఈపాట పాడిన తల్లీ, నీవు ఏ సీమలో పాడేవు? ఎప్పుడు పాడేవు? అపర సంజవేళ, ఏ అడవిలోనో పాడి ఉంటావు. తోడేళ్ళూ, పులులూ, పాములూ, కమ్ముకొస్తున్న చీకటీ - పాపం, ఆయి ఆయి ఆయి ఆపదలు కాయి అంటున్నావు అంతేనా. వెర్రి తల్లీ ఎలాగ కాపాడుకొని వచ్చావో, ఆ బిడ్డను?

ఎన్ని ఆలోచనలు పరుగులెత్తుతూ వచ్చేవో, నీ మనస్సులోని కప్పుడు? ఈ బిడ్డ రెప్పలమీద ఊగే నిద్ర, ఎక్కణ్ణించి వచ్చిందో. ఆ అడవి గుబురులో, మిణుగురుపురుగులాడే ఆ కొమ్మల్లో రెండు సిగ్గరి పువ్వు మొగ్గలున్నాయట. వాటిలో దాగున్నా నిద్ర పాప కళ్లలోకి వచ్చింది? పాప పెదవులమీద పరుగులెత్తే నవ్వో? అదుగో కొమ్మల్లోంచి ఆ తెల్ల మబ్బు కనపడుతోంది? ఆ నెలవంక కనపడడం లేదూ? ఆ మబ్బు అంచులమీద ఆ నెలవంక కిరణం వాలింది. అక్కణ్ణించి పాప పెదవుల మీదికి జారిందిలే. పాప అస్తమానమూ ఏడుస్తుంది. ఆ మొగ్గల్లో ఉన్న నిద్ర అంతా తెచ్చి ఆ మబ్బు పెదవుల మీద నవ్వంతా తెచ్చి, నీవు దాచి ఉంచుకోవమ్మా నీలో. అంత నవ్వూ, అంత మగతా నీలో ఉండి ఉన్నప్పుడు ఎలాగ నీ గుండె మోయడం. పాడ కూడదూ తల్లీ. మళ్లీ మళ్లీ పాడకూడదూ,

ఆయి ఆయి ఆయి ఆపదలు కాయి - అని?

తీగలతో ఉయ్యాలకట్టు, ఆకులతో పానుపు లమర్చు, గాలులతో కలసి ఊపు. పులుగులతో పాడు. అమ్మా నీవు నాకూ తల్లివే. పాడు తల్లీ ఒక్క సారి. ఆయిఆయిఆయిఆపదలుకాయి-అని.

అప్పటినుంచి యెందరు తల్లులు ఇంతవరకూ పాడేరో. ఎక్కడున్నా, ఎప్పుడున్నా ప్రతీ తల్లీ నాతల్లే. మాతృమూర్తి ఒక్కతే. బిడ్డా ఒక్కడే. అప్పటినుంచి కలిమిగల యిళ్ళల్లో తల్లులున్నారు. నిరుపేద తల్లులున్నారు. ఒక్కడే ఒక్క బిడ్డనుగన్న తల్లులున్నారు, గంపెడు బిడ్డల గారాల తల్లులున్నారు. సరి కొత్త తల్లులున్నారు. కానుపుల్లో గడితేరిన అదితి దేవులవంటి తల్లులున్నారు. అందరూ కలిసి ఒకే ఒక తల్లి అందరమూ కలిసి ఒకే ఒక బిడ్డ. అందువల్ల తెలుగునాటి తల్లి కూడా యెన్నియుగాలనుంచో కరకాలంగా రసరసాలతో నిండిన జోలపాటల పాడింది. వనవాసం చేస్తూన్న సీతాదేవియై ఒకసారి, కంసుని చెరసాలలో ఉన్న దేవకీదేవియై ఒక సారి, యశోదయై ఒకసారి జోలపాటలు పాడుతుంది. అప్పుడా బిడ్డ రాముడో కృష్ణుడో, పార్వతో, లక్ష్మో అయిపోతుంది. తన పేదతనమో, తన కలిమో, తన ఒంటరితనమో, తన బలగమో, ఏదో మనస్సులో ఉంచుకుని, స్థితి

గతుల్ని బట్టి పాటలు కట్టుకుని పాడుతూ వస్తుంది.

తల్లులకు తల్లి సీతాదేవి. జనకరాజు కూతురు. భూదేవి ముద్దు బిడ్డ. రామచంద్ర ప్రభువుల ప్రాణేశ్వరి. ఆ తల్లి ప్రవాసంలో వాల్మీకి ఆశ్రమంలో కుశలవుల్ని కన్నది. నా అన్న వారందరికీ దూరురాలైన సీతమ్మ కుశలవుల్ని ఉయ్యాలలో పరుండబెట్టి, జోలపాట పాడుతుంది.

నార చీరలతోను ఉయ్యాల వేసి,
జానకీ తనయులను జోలల్లె పాడి

పాపం నార-చీరలతోనే ఉయ్యాల వేసింది. సీతామహాదేవి ఏమని పాడుతుంది?

ఏడవకు కుశలవుడ రామకుమార
ఏడిస్తే నిన్నెవ్వ రెత్తుకుంటారు?
ఉంగరమ్ములు కొనుచు ఉయ్యాలగొనుచు
ఊర్మిళా పినతల్లివచ్చె నేడవకు
పట్టులుంగీ గొనుచు పులిగోరు గొనుచు,
భూదేవి అమ్మమ్మ వచ్చె నేడవకు
రావి రేకలుగొనుచు రత్నాలు గొనుచు
లక్ష్మన్న పినతండ్రి వచ్చె నేడవకు.
ఏడవకు కుశలవుడ రామకుమార,
ఏడిస్తే నిన్నెవ్వ రెత్తుకుంటారు—అని.

జోలపాటలలో ఈ పాట అంత తీయని పాటలేదు. ఇంతగా గుండెలను పొడిచే పాటా లేదు. ఇంత రసవంతమైనదీ లేదు. సీతమ్మను రామయ్య తండ్రి వాల్మీకి ఆశ్రమానకు పంపించివేశాడు. ఎంత కఠినుడో, తల్లితో చెప్పనైనా చెప్పకుండా నిండు చూలాల్ని పంపించేశాడు నా తండ్రి. వాల్మీకి ఆశ్రమంలో పురుడువచ్చింది. కుశలవులు పుట్టారు. పాపం యేంచేస్తుంది, అమ్మ—నార చీరతో ఉయ్యాల కట్టింది. ఊయాలలో బిడ్డలు యేడుస్తారు. అమ్మకూ దుఃఖంవచ్చి ఉంటుంది. "రామకుమారా! నిన్నెవ్వ రెత్తుకుంటారు ఏడిస్తే!" అంటుంది. ఎత్తుకోవలసిన రాముడు అక్కడ లేడు కదూ? ఆ ప్రవాస జీవనానకూ ఆ అడవిలో కాన్పునకూ, ఆ నారచీరల ఊయాలకూ, ఆ బిడ్డకూ, కారణమైన ఆ రాములకూ, ఆ పిలుపులో అంత అర్థముంది. నీ పినతల్లి ఊర్మిళ, నీ అమ్మమ్మ భూదేవి, నీ పినతండ్రి లక్ష్మణుడు కానుకలు తెచ్చారు. ఊరుకో అంటుంది. ఎందుకు ఊరుకో అంటుంది? ఎందుకు ఊరుకుంటాడు? అమ్మవాకే లోపల కుమిలికుమిలి దుఃఖిస్తుంది. ఆమెను యెవరు ఓదారుస్తారు? అయ్య వచ్చాడు అనలేదు. అనదు సీతమ్మ. కాని లోపల ఆ తండ్రే రావాలని ఉంటుంది. అద్భుతమైన ఈ పాట యే తల్లి మొదట పాడిందో! తరవాత తెనుగునాట దిక్కుమాలిన బిచ్చకత్తెలెందరో, బిచ్చమెత్తుకుంటూ, చేతుల్లో బిడ్డను ఊపుకుంటూ, ఈ పాట పాడుతున్నారు. మనకు యెంత జాలయినా పుడుతుంది.

శ్రీకృష్ణుడికి గోపికలు పాడే జోలపాటలలో అలవికానంత ఆనందోత్సవం ఉంది. ఉండకేం చేస్తుంది. వాళ్ళకేం? కృష్ణుడికేం?

లాలనుచు పాడరమ్మా, ఈబిడ్డ లక్ష్మీ
విలాసుడమ్మా,
పాదమున చక్రమమ్మా, ఈ బిడ్డ వేదాంత
వేద్యుడమ్మా,
వేణు నాదంబుతోను ఈ బిడ్డ వేదములు
పాడునమ్మా.

అంటూ చల్ల తరచిన చప్పుళ్ళూ, గాజుల ఉలివూ, ఆవుల అంభారవమూ—అన్నింటితో శ్రుతి కలిపి తీయని గొంతులు సన్నగా యెత్తి ప్రేపల్లెలో పాడారు.

ఇట్లాగే తమ బిడ్డను "శ్రీ రామచంద్రమూర్తి" అనుకున్నారు కొందరు తల్లులు.

రామా లాలీ, మేఘ శ్యామా లాలీ,
తామారాసనయన దశరథ
తనయా లాలీ.
అద్దాలా తొట్టెలో నీవు ఆడుకొందూవూ—
ముద్దు పాపడంచూ నిన్ను
మురిసీ చూసేరు.

పరమ శివుడూ దిగంబరుడూ అయిన ఆదిభిక్షువే తన యింట్లో తెలిసి ఊయాలలో ఒదిగి, తన ప్రేమ భిక్షకోసం ఏడుస్తున్నాడనుకొంటుంది మరొక పిచ్చితల్లి.

లాలి శంకర, సదా లాలిత కుమారా!
లాలి పటు తాండవోల్లాస ఘన ధీరా.
లాలి పంచాస్య, కైలాస సంచారా.
లాలి మధురాలాప లాలి గంభీరా

అని. మరొక ఊయాలలో సీతాదేవి వెళ్ళి ఊగుతుంది. అప్పుడు తెలుగుతల్లి సీతమ్మకే తల్లి అవుతుంది.

లాలి బంగరు బొమ్మ, లాలి మాయమ్మ,
లాలి ముద్దులగుమ్మ లాలి సీతమ్మ,

అని పాడుతుంది.

తెలుగు పల్లె. పల్లెలో ఇల్లు. ఇంటిలో చావడి. అక్కడ దూలాన వేలాడే గుడ్డ ఊయాలలో గొలుసులకు కట్టిన తొట్లో, దానిలో బిడ్డ, ప్రక్క తల్లి. పచ్చి ఒడలంతా బంగారు పూత, కనుబొమ్మల క్రిందనుంచి కపోలం దాకా చిక్కని కాటుక. నుదుటిపై నిండుగా కుంకుమ బొట్టు. పలచని తెలివలువ. నిర్భరప్రేమతో నిండిన బరువు పాలిండ్లను దాచే రైక. తాంబూల రాగం చాలనట్లు చిరునవ్వు కూడా పొదిగిన ఎర్ర నెర్రనైన పెదవులు. మెరిసే చూపులూ- వీటితో బాలెంత తామరతూళ్ళ వంటి చేతులను చాపి, కోయిల కూతవంటి ఆ గొంతునెత్తి, బిడ్డమీద అనురాగం దాచుకో లేక, ఆ అనురాగాన్ని ఏమి చేయాలో తెలియక, అనుకోకుండా ఎన్ని రకాలుగానో పాడుకుంటూ వస్తుంది. నిజానకు బిడ్డను జోకొట్టడానికి ఆ పాట. తన ఆనందమూ ప్రేమా ఏమిచెయ్యాలో తెలియక తల్లి పాడుతుంది. భర్త దూరదేశాన ఉన్నప్పుడు, 'నాన్న వస్తున్నాడు, ఊరుకో' అని పాడుతుంది. గర్వంగా పుట్టింటి వారిని తలచుకుని, ఆ బిడ్డను తన తండ్రీ, తన సోదరులు చూస్తే, ఏమనుకుంటారో అనుకుంటూ, అద్భుతంగా ఎక్కడ నుంచో వచ్చిన ఈ వరాన్ని వారు ఎప్పుడు చూస్తారో అని ఉవ్విళులూరుతూ, అత్తింట ఉన్న తన కళ్ళు పుట్టింటదాకా చూస్తూన్నట్లున్న దూరపు చూపులతో, శాంత మందరస్వరంతో, మీ మామయ్య కాసులు తెచ్చాడు, మీ తాత మురుగులు తెచ్చాడు- ఉరుకో అంటూ కూను రాగం తీస్తూ కూనురాగం ఊపునకు సరిపోయే లాగ ఊయేల లూపుతూ, మునిచూపు సమయంలో, పరుగెత్తుకుని వచ్చే చీకట్లలో భవిష్యత్తు అగమ్యంగా ఉండి, చెప్పరాని దిగులు ఏదో మనస్సులో ప్రవేశిస్తే ఆ దిగులులో లేని ఆపదలను వేటినో శంకిస్తూ, తన చేతుల్నే బిడ్డకు ఊయేల చేసి, లేక తన గుండెల్నే తొట్టి చేసి, నిన్ను రామచంద్రమూర్తి రక్షిస్తాడు, దేవతలందరూ రక్షిస్తారు. ఏడవకు పడుకో- అంటూ గవాక్షంలోంచి ఊరి పొలిమేర జీబు చింత వైపు చూస్తుంది. కోడి కూతతో లేచి, పాపకు నీళ్లుపోసి, కాటుక పెట్టి, బొట్టుపెట్టి, ఊయాలలో పరుండబెట్టే సమయానకు, గవాక్షంలోంచి పైడికిరణాలూ, పక్షికూతా పారిజాత వాసనా వచ్చేసరికి, అణుచుకో లేని ఆనందమూ, అలవికాని ఆశలూ లోపల నిండుకోగా, నాన్నా, నువ్వు రాముడు లాగా గొప్పవాడ వవుతావు, కృష్ణుడి లాగ సుఖపడతావు, అమ్మా, నువ్వు మహాలక్ష్మిలాగ కలిగి ఉంటావు, గౌరిలాగ సౌభాగ్యవతి వవుతావు, అంటూ తన కోరికలనే ఆశీస్సులుగా చేసి, హృదయాన్ని ఒక ఊయాల చేసి దానినీ, పాపపరున్న ఊయాలలనీ సమానంగా ఊపేస్తూ పాడుతుంది. ఎక్కడికో వెళ్ళిన బాబు తండ్రి ఎంతకూ రారు. చిల్లర వేషాలు ఎక్కువ ఆయనకు. కోడెపనులూ, కొంటె చూపులూ తెలుస్తూనే ఉంటాయి, అనుకుంటూ ఆ పడుచు తల్లి బిడ్డవైపు చూస్తుంది. ఆ బిడ్డ కళ్లు మిలమిల లాడుతూ చూస్తుంటాయి, దూలం వైపు. ఆ తండ్రి కొడుకు కాదూ?

తుమ్మెద నీ కళ్లు దూలాల మీద
బాలయ్య నీ కళ్లు మగవాళ్ల మీద
నిద్రవి నీ కన్నుల్లు మబ్బు మొగముల్లు
నిద్రకు నూరేళ్లు నీకు వెయ్యేళ్లు
నిన్ను గన్నయ్యకూ నిండ నూరేళ్లు.

అంటుంది.

ఇట్లాగ తన కష్ట సుఖాలలో ఎన్నో ఇతరులతో చెప్పడానికి శంకించేవి, బిడ్డతో నిర్భీతిగా పాటల వంకబెట్టి తల్లి చెప్పేస్తుంటుంది.

ఈ జోలపాటలు నెమరు వేస్తుంటే, నేనూ ఊయాల బిడ్డంత నిసుగునలు పోతున్నాను. కాని మా అమ్మ ఎక్కడికి వెళ్ళిందో. మా అమ్మలేదు. ఉన్నదికూడా, నీ ఇంటా నాఇంటా.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో.)

Source: Sri Sudhama gaaru, Telugu Swatantra Magazine

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/